సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



నిర్వహణలో డకౌట్
దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా–సి, ఇండియా–డి జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహణలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ విఫలమైంది. 8లో



టమాట కిలో రూ.23
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.2°/23.4°
జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.



మడకశిరలో 25 తలల వినాయకుడి విగ్రహం



ప్రశాంతి నిలయంలో కొలువుదీరిన వినాయకుడు



ధర్మవరంలోని కలవల వారి వీధిలో ఎర్రకోట నమూనా వద్ద గణనాథుడు



రొద్దంలో పూజలందుకుంటున్న 21 అడుగుల మట్టి గణపతి

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..

జిల్లా అంతటా వినాయక చవితి ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన గణపయ్య విగ్రహాలు శనివారం నుంచి ప్రత్యేక పూజలందుకుంటున్నాయి. బహు రూపాల్లో దర్శనమిస్తున్న ఏకదంతుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తరిస్తున్నారు. పలు చోట్ల ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు నిర్వహించారు.

గణేశ్ మహరాజ్‌కీ జై

ప్రశాంతి నిలయం: వినాయక చవితి వేడుకలు ప్రశాంతి నిలయంలో శనివారం ఘనంగా జరిగాయి. సాయికుల్వంత్ సభా మందిరాన్ని, ప్రశాంతి నిలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేక ఫలపుష్పదళాలతో తీర్చిదిద్దారు. ప్రశాంతి నిలయంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సన్నిధిలో వినాయకుడిన కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. దేశ విదేశాల భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అనుబంధ సంస్థల్లో ఒక్కో సంస్థ ఒక్కో రూపంలో రూపొందించిన వినాయకులను కొలువుదీర్చి పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు పూజలు కొనసాగనున్నాయి.



కదిరి రైల్వే స్టేషన్ సమీపంలో కొలువుదీరిన గణేశుడు

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 34,881 క్యూసెక్కుల నీరు నదిలో చేరింది. జలాశయం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో వరద పెద్ద ఎత్తున వస్తోంది. దీంతో 13 గేట్లను ఎత్తి 24,210 క్యూసెక్కులు నదికి, 10 వేల క్యూసెక్కులు కాలువలకు కలిపి మొత్తం 34,881 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 101.770 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,632 అడుగులకు నీరు చేరింది. మరో వైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలో మీటర్ వద్ద 1,850 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఆర్టీసీ బస్సు బోల్తా



బత్తలపల్లి: మండలంలోని గుమ్మళ్లకుంట బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురు స్వల్పగాయాలతో బయట పడ్డారు. వివరాలు... అనంతపురం డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు శనివారం ఉదయం నల్లమాడ నుంచి అనంతపురానికి 30 మంది ప్రయాణికులతో బయలుదేరింది. గుమ్మళ్లకుంట బస్టాప్ సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో పొలాల్లోకి బస్సు దూసుకువెళ్లి రాళ్లను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ కంచర్ల లక్ష్మయ్య (అశోక్‌నగర్, అనంతపురం), కండక్టర్ నీలా రాజశేఖర్(గార్లదిన్నె)తో పాటు ప్రయాణికురాలు బొజ్జ మంగమ్మ(పాముదుర్తి) గాయపడ్డారు. పొలాల్లో ఉన్న రైతులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి బస్సులోని ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారు స్వగ్రామాలకు తిరిగి వెళ్లారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

రేషన్ బియ్యం.. నాణ్యతా లోపం

- చౌకదుకాణాల ద్వారా కార్డుదారులకు పంపిణీ
- స్కూళ్లు, హాస్టళ్లకూ నాణ్యత లేని బియ్యమే సరఫరా
- భోజనం తినలేక అవస్థలు పడుతున్న విద్యార్థులు
- మిల్లర్లతో కుమ్మక్కై నాసిరకం బియ్యం దందా



రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసిన బియ్యం



ముద్దగా అయిన అన్నం

సాక్షి, పుట్టపర్తి: సబ్సిడీ రేషన్ బియ్యంలో నాణ్యత లోపించింది. ఇదేంటని ప్రశ్నిస్తే.. ఇష్టముంటే తీస్కో.. లేదంటే వదిలి వెళ్లు.. అని డీలర్లు దబాయిస్తున్నారు. మా ఇంట్లో తయారీ చేసినవి కాదు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకును ఇక్కడ అందజేస్తున్నాం.. అంటూ సమాధానమిస్తున్నారు. కార్డుదారులతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు కూడా నాసిరకం బియ్యమే పంపిణీ చేస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో అన్నం ముద్దగా మారుతోంది. ఫలితంగా తినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఇంటి దగ్గర నుంచి తెచ్చుకుంటున్న భోజనమే తింటున్నారు. రేషన్ కార్డుదారులు నాసిరకం బియ్యంపై అసమ్మతిగా ఉన్నారు. గడిచిన ఐదేళ్లు నాణ్యతతో కూడిన బియ్యం ఇచ్చారని.. ఇప్పుడిలాంటి పరిస్థితులు ఏంటని వాపోతున్నారు. గడిచిన ఐదేళ్లలో నాణ్యమైన రేషన్ బియ్యం అందాయని.. కొత్త ప్రభుత్వంలో నాసిరకం బియ్యం తినాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద గోల్‌మాల్

పొరుగు జిల్లాల మిల్లర్ల నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం సరఫరా కావాలి. అక్కడ అధికారులు నాణ్యతా ప్రమాణాలు సరి చూసిన తర్వాత దుకాణాలకు పంపించాలి. అయితే గోదాములకు చేరుతున్న బియ్యంలో సగానికి పైగా నాసిరకం వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్లతో పాయింట్ల నిర్వాహకులు కుమ్మక్కై అధికారులకు ముడుపులు ముట్టచూపి ఎలాంటి తనిఖీలు చేయకుండా.. నేరుగా రేషన్ దుకాణాలకు పంపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 12 చోట్ల ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు బియ్యం పంపిణీ అవుతుంది.

నిబంధనలు తుంగలో తొక్కి

ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఉచితమే కదా.. ఎలాంటివి ఇచ్చినా తీసుకోవాల్సిందేనంటూ డీలర్లు హుకుం జారీ చేస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా సరఫరా కావాల్సి ఉండగా.. అక్కడి నుంచి మాయం అవుతున్నాయి. ఎటు వెళ్తున్నాయో తెలియడం లేదు. కాగా నేరుగా మిల్లర్ల నుంచి ముక్కిపోయిన బియ్యం చౌకదుకాణాలకు చేరుతోంది. మిల్లర్లతో కాంట్రాక్టర్లు కుమ్మక్కై పేదలకు నాసిరకం బియ్యం పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

రేషన్ బియ్యం అంటే ఎన్నో దశాబ్దాలుగా నాసిరకమనే భావన ప్రజల్లో ఉంది. అయితే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక.. పాత కథకు స్వస్తి పలికి అన్ని చౌకధాన్యపు దుకాణాల్లో నాణ్యమైన స్వర్ణ రకం మధ్యస్థ సన్న బియ్యం పంపిణీ చేశారు. ఫలితంగా రేషన్ బియ్యం కోసం కార్డుదారులు ఎగబడేవారు. ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాలు రద్దు చేశారు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే బియ్యం నాణ్యతగా లేవు. మూడు నెలలుగా కందిపప్పు, గోధుమపిండి, చక్కెర అందడం లేదు.

జిల్లా వివరాలు

రేషన్‌షాపుల సంఖ్య
1,367

రేషన్ కార్డుదారులు
5,62,784

నెలకు సరఫరా అయ్యే బియ్యం
8,700 మెట్రిక్ టన్నులు

ఫిర్యాదులు రాలేదు

బియ్యంలో నాణ్యత లోపించిందనే ఫిర్యాదులు నా దృష్టికి రాలేదు. ఎంఎల్‌ఎస్ పాయింట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. గోదాముల వద్ద పటిష్ఠ నిఘా ఉంది. అవకతవకలకు అవకాశం లేదు. నాసిరకం బియ్యం అందుతుంటే వెంటనే ఫిర్యాదు చేయొచ్చు. ముక్కిన బియ్యం వచ్చినా.. మాకు సమాచారం ఇవ్వండి.

– అశ్వర్థనారాయణనాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్

రేపు జాబ్ మేళా



హిందూపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా నైపుణ్యాధికారి అబ్దుల్ ఖయ్యూం, కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ బాబు మీడియాకు వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని వివరించారు. ఎంపికైన వారు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా, హైదరాబాద్, బెంగళూరులో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలు తీసుకొని, మంగళ వారం ఉదయం తొమ్మిది గంటల హాజరు కావాలని సూచించారు. ఇంటర్వ్యూకు వచ్చేవారు https://rb.gy/70ax6l లింక్‌లో పేరు రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 99666 82246 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సూపర్ సిక్స్ పేరుతో నయవంచన

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు స్వాగతం పలికిన సమన్వయకర్తలు, నాయకులు

పెనుకొండ: కూటమి నేతలు ఎన్నికల్లో ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాలను.. అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షురాలి హోదాలో ఆమె ఆదివారం పెనుకొండలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై కూటమి సర్కార్ ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, అన్నదాతా సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20వేల సాయం, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.15వేలు, ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అమలులో తాత్సారం చేస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు క్యాలెండర్ ప్రకారం అమలు చేశారని గుర్తు చేశారు. మంచిని చేసే పాలకులెవరో.. వంచన చేసే పాలకులెవరో ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు.

భారీ కాన్వాయ్‌తో స్వాగతం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలి హోదాలో తొలిసారి పెనుకొండకు వచ్చిన ఉషశ్రీచరణ్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కాన్వాయ్‌తో స్వాగతం పలికారు. దాదాపు 300 కార్లతో ర్యాలీ నిర్వహించారు. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ, స్థానిక నాయకులు వాల్మీకి/బోయ విభాగం అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, శేషాద్రి, కౌన్సిలర్ సుధాకరరెడ్డి, పార్టీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నాయకులు సునీల్, సద్దాం, యాసిన్, చెన్నకేశవులు, కొండలరాయుడు, జయశంకరెడ్డి, గోపాలరెడ్డి, కిష్టప్ప, శ్రీరామరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని పోలీస్ అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలో పోలీస్ అధికారులు, ఎస్‌ఐ, కోర్టు పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కారం చేసుకుంటే శ్రమ, సమయం తగ్గుతుందని, ఇరుపక్షాల మధ్య స్నేహ సంబంధాలు ఉంటాయని తెలియజేయాలన్నారు. కేసుల విషయంలో ఉన్న అపోహలు తొలగించి వారి సమ్మతితో ఇరువర్గాలను ఒప్పించి రాజీ చేయడం వల్ల పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ గురించి అవగాహన కలిగిస్తూ ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వీలైనంత ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవనం నేలమట్టం

- స్థలం కబ్జాకు టీడీపీ నేతల యత్నం



దశాబ్దాల నాటి రైతుల కోఆపరేటివ్ సొసైటీ భవనం కూల్చివేత



కూల్చివేత అనంతరం చదును చేసిన దృశ్యం

హిందూపురం: రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరింది. అధికార టీడీపీ నాయకుల్లో కొందరు అడ్డగోలు సంపాదనకు బరితెగించారు. రూ.కోట్లు విలువ చేసే స్థలం కబ్జాకు పథక రచన చేశారు. ఇందులో భాగంగా హిందూపురంలోని మెయిన్‌బజార్‌లోని పేట వెంకటరమణస్వామి ఆలయం పక్కనున్న పాల రైతుల కోఆపరేటివ్ సొసైటీ భవనం రెండురోజుల క్రితం కూల్చివేశారు. 1938లో దాదాపు 177 మంది పాడి రైతులు కలిసి మూడు సెంట్లకు పైబడి స్థలాన్ని కొనుగోలు చేసి సొసైటీ భవనం నిర్మించుకున్నారు. ఆ రోజుల్లో దాదాపు వెయ్యి లీటర్ల పాలు సేకరించి విక్రయించే వారు. కాలక్రమేణ వ్యాపారాలు తగ్గిపోవడంతో సొసైటీని మూసివేశారు. గత ఐదేళ్ల క్రితం సొసైటీ భవన స్థలం కాజేయడానికి ప్రయత్నాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలో రావడంతో ఆ ప్రయత్నం మానుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో టీడీపీ నాయకులు కొందరు మున్సిపాలిటీ పరిధిలో ఖాళీస్థలాలు, పాత భవనాలపై కన్నేశారు. అందులో భాగంగా రూ.2 కోట్లకు పైబడి విలువ చేసే పాల సొసైటీ స్థలం కాజేయాలని అర్ధరాత్రి సమయంలో భవనాన్ని జేసీబీ యంత్రాలతో కూల్చివేశారు. ఈ భవనంలోని వందకు పైగా పాలు నిల్వ చేసే సిల్వర్, అల్యూమినియం వంద లీటర్ల క్యాన్లు, లాకర్లు, పాల కూలింగ్ మిషన్, జనరేటర్, కొంత నగదు, డాక్యుమెంట్లు ఇతర వస్తువులన్నీ మాయమైపోయాయి.

స్థలం కాజేయాలనే ఎత్తుగడ



ఏళ్లకాలం నాటి పాడి రైతుల సొసైటీ భవన స్థలాన్ని కొందరు కాజేయాలని రాత్రికి రాత్రే కూల్చివేశారు. ఈ సొసైటీలో వందమందికి పైగా రైతులు షేర్‌హోల్డర్స్‌గా ఉన్నారు. కూల్చివేసిన భవనంలోని చాలా విలువైన సామగ్రి, డ్యాకుమెంట్లు మాయమైపోయాయి. దీనిపై ప్రభుత్వం స్పందించాలి. పోలీసు అధికారులు కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– విజయకుమార్, హిందూపురం

క్లుప్తంగా

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

మడకశిర: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. పురుషుల విభాగంలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, పరుగు పందెం, వాకింగ్, షాట్‌పుట్, జావలిన్‌త్రో తదితర పోటీలు ఎంతో ఆసక్తిగా సాగాయి. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు భూతన్న, నాయకులు తాహిర్‌వలి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు పొందిన నరేంద్ర, ప్రకాష్‌రెడ్డి, సుజాత, రవికుమార్, శివప్రసాద్‌ను సన్మానించారు.

ఒకరి మృతి

కదిరి టౌన్: బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో కదిరి మండలం ఎగువపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మహేష్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం రాత్రి స్వగ్రామానికి చెందిన గంగాధర్‌తో కలసి బైక్‌పై వస్తుండగా ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన గంగాధర్‌ను స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. మృతుడికి భార్య ఉంది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు.

కొండపై నుంచి జారి పడి...

మడకశిర: ప్రమాదవశాత్తు కొండపై నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... మడకశిరలోని కొండకు శివపురంలో నివాసముంటున్న మంజునాథ్ (32)కు మతిస్థిమితం లేదు. మూడు రోజుల క్రితం ఆయన కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు, బంధువులు ఎంత వెతికినా మంజునాథ్ ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం కొండ దిగువన పొదల్లో మంజునాథ్ మృతదేహాన్ని కుళ్లిన స్థితిలో స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొండపై నుంచి జారి పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

రొళ్ల: మండలంలోని చిగమతిఘట్టలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ రాజశేఖర్ ఆదివారం వెల్లడించారు. రెండు రోజుల క్రితం అందిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు చిగమతిఘట్టలో తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకను పసిగట్టిన జూదరులు అక్కడి నుంచి పారిపోతుండగా పోలీసులు వెంటాడి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.78,480 నగదు, 5 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఏడుగురికి కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. మొత్తం 13 మందిపై కేసు నమోదు చేశారు.

ఇండియా 'సీ' శుభారంభం

- సమష్టిగా రాణించి విజయం కైవసం
- ఆల్‌రౌండర్‌గా మెరిసిన మనవ్ సుతార్
- ముచ్చటగా మూడో రోజే ముగిసిన మ్యాచ్



మనవ్ సుతార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న మాంఛూఫెర్రర్



షార్ట్ లెగ్ దిశగా బంతిని కొడుతున్న బ్యాటర్

అనంతపురం: అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా–సీ జట్టు శుభారంభం చేసింది. ఇండియా–డీపై నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు రోజుల మ్యాచ్ కాస్తా మూడో రోజు శనివారమే ముగిసిపోయింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మనవ్ సుతార్ అటు బాల్, ఇటు బ్యాట్‌తో రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 8 వికెట్ల నష్టానికి 206 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో శనివారం మూడోరోజు ఆట కొనసాగించిన ఇండియా–డీ జట్టు మరో 30 పరుగులు జోడించి మిగిలిన రెండు వికెట్లు కోల్పోయి 236 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా–సీ బౌలర్ మనవ్ సుతార్ ఏడు వికెట్లతో ఇండియా–డీ పతనాన్ని శాసించాడు. అలాగే విజయకుమార్ వైశాఖ్ 2, అన్షుల్ కాంబోజ్ ఒక వికెట్ తీశారు.

ఆడుతూ..పాడుతూ

నాలుగు పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత పోను 233 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–సీ జట్టు ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రుతురాజ్ 48 బంతుల్లో 8 ఫోర్లతో 46 పరుగులు చేశాడు. సాయి సుదర్శన్ 22, ఆర్యన్ జుయల్ మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 47, రజత్ పటిదార్ ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించారు. బాబా ఇంద్రజిత్ (7 పరుగులు), హృతిక్ షోకీన్(0) తక్కువ స్కోరుకే ఔట్ అయినప్పటికీ వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్ 35 పరుగులు (నాటౌట్), మనవ్ సుతార్ 19 పరుగులు (నాటౌట్) చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఇండియా–డీ బౌలర్లలో సరాన్ష్ జైన్ 4, అర్ష్‌దీప్‌సింగ్, అక్షర్ పటేల్ చెరో వికెట్ తీశారు.

ఇండియా-సీ (రెండో ఇన్నింగ్స్)-233/6			
రుతురాజ్ గైక్వాడ్	46	(సి) శ్రేయస్ అయ్యర్	(బి)సరాన్ష్ జైన్
బి.సాయిసుదర్శన్	22	(సి)రికీభుయి	(బి)సరాన్ష్ జైన్
ఆర్యన్ జుయల్	47	(సి)హర్షిత్ రాణా	(బి) అర్షదీప్ సింగ్
రజత్ పటిదార్	44	(స్టంప్) కేఎస్ భరత్	(బి) సరాన్ష్ జైన్
బి.ఇంద్రజిత్	7	(సి)అథర్వ టైడ్	(బి) సరాన్ష్ జైన్
అభిషేక్ పోరెల్	35	నాటౌట్	
హృతిక్ షోకీన్	0	(సి)రికీ భుయి	(బి) అక్షర్ పటేల్
ఎంజే సుతార్	19	నాటౌట్	
ఎక్స్‌ట్రాలు	13		
ఓవర్లు	61		
స్కోర్	233/6		

బౌలింగ్	ఓవర్లు	మేడిన్	పరుగులు	వికెట్లు
హర్షిత్ రాణా	6	0	39	0
అర్షదీప్ సింగ్	9	1	37	1
సరాన్ష్ జైన్	22	2	92	4
అక్షర్‌పటేల్	22	6	54	1
ఏఎస్ థాక్రే	2	0	6	0



రజత్ పటిదార్‌ను స్టంప్ అవుట్ చేస్తున్న వికెట్ కీపర్ కేఎస్ భరత్

నేడు అనంతకు ఇండియా ఏ, బీ జట్ల రాక

దులీప్ ట్రోఫీలో భాగంగా తొలి రౌండ్‌లో ఒక మ్యాచ్ అనంత క్రీడా గ్రామంలో, మరో మ్యాచ్ బెంగళూరులో జరిగింది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లూ ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు అనంత క్రీడాగ్రామంలోనే నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బెంగళూరు నుంచి ఇండియా ఏ, బీ జట్ల క్రీడాకారులు రానున్నారు. ఇండియా–ఏకు శుభమన్‌గిల్, బీ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌లుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. కాగా, 12 నుంచి 15వ తేదీ వరకూ టీమ్–ఏ, టీమ్–డీ మ్యాచ్ అనంతపురం ఆర్డీటీ స్టేడియం–ఏలో, టీమ్–బీ, టీమ్–సీ మధ్య మ్యాచ్ ఏసీఏ మైదానంలో జరుగుతాయి. 19 నుంచి 22వ తేదీ వరకు టీమ్–బీ, టీమ్–డీ మ్యాచ్ స్టేడియం–ఏలో, టీమ్–ఏ, టీమ్–సీ మధ్య మ్యాచ్ ఏసీఏ మైదానంలో ఉంటాయి.

ప్రమాదంలో యువకుడి మృతి

రామగిరి: వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం ఎంసీపల్లికి చెందిన గోవిందు (30) శనివారం తన సోదరుడితో కలసి అనంతపురానికి వెళ్లాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై ఇద్దరూ బయలుదేరారు. మార్గం మధ్యలో పోలేపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా శరవేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఆయన సోదరుడిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై రామగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్య దీప, ఓ కుమారుడు ఉన్నారు.

ఐదుగురి దుర్మరణం

పావగడ: రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మృతులందరూ పావగడ వాసులే కావడం గమనార్హం. వివరాలు.... బెంగళూరులో నివాసముంటున్న పావగడ తాలూకా ఎత్తినహళ్లి (ఎద్దులపల్లి)గ్రామానికి వచ్చిన గీతా రాణి, సింధూజ, వారి కుటుంబసభ్యులతో కలసి వినాయక చవితి పండుగకు స్వగ్రామానికి వచ్చారు. ఆదివారం వీరు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మధుగిరి తాలూకా కెరెగళపాళ్య సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొంది. ప్రమాదంలో జనార్దనరెడ్డి (55), ఆయన కుమార్తె సింధూజ (30), ఆమె కుమారుడు యోగేష్ (80), కాలేనహళ్లికి చెందిన డ్రైవర్ సిద్దగంగప్ప(34), నాగరాజు(30) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గీతారాణి, ఆమె కుమార్తె తుమకూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలియగానే ఎత్తినహళ్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మార్చురీలో ఉన్న మృతదేహాలు

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కవి జాబిలికి చోటు



జాబిలి చాంద్‌బాషా

పెనుకొండ: వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పెనుకొండకు చెందిన కవి జాబిలి చాంద్‌బాషాకు చోటు దక్కింది. శనివారం ఆయనకు వర్చువల్ విధానంలో సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందజేశారు. ఉపాధ్యాయుడిగా, కవిగా, సామాజిక కార్యకర్తగా, రచయితగా 22 సంవత్సరాలుగా జాబిలి చాంద్‌బాషా బహుముఖ ప్రజ్ఞతో రాణిస్తున్నారు. ఇప్పటికే 200కు పైచిలుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నారు. జనగణమన లక్ష గళార్చన, 1,250 అడుగుల త్రివర్ణ పతాక ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.

బెలూన్‌లే కాపాడాయి



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లి వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదంలో కారులో బెలూన్‌లో తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం కారులో మంత్రాలయానికి వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. ఆ సమయంలో కారులో ఉన్న ఎయిర్ బెలూన్లు ఒక్కసారిగా తెరుచుకోవడంతో ఎవరూ గాయపడలేదు. కారు మాత్రం నుజ్జునుజ్జయింది.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం హ్యాండ్ బాల్ సీనియర్, సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 100 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. సబ్‌జూనియర్ జట్టులో జస్వంత్‌నాయక్, సాయికుమార్, విశ్వనాథ్, వేణు, సిద్దార్థ, మంజునాథ, యోగేందర్, వంశీ, పవన్, సురేష్, ప్రశాంత్, చరణ్, మహేశ్వర్ భరత్ చోటు దక్కించుకున్నారు. సీనియర్ జట్టుకు డేనియల్, యాసిర్, భరత్, మహ్మద్ అనీఫ్, మల్లికార్జున, అరుణ్‌కుమార్, మహేష్, తనయ్, సాదిక్, ఫైజాన్, కుమార్, ప్రవీణ్‌నాయక్, నారాయణస్వామి, బ్రహ్మపుత్రా రెడ్డి, తిరుమలేష్ ఎంపికయ్యారు. ఎంపిక ప్రక్రియను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, మహేష్, వంశీ పర్యవేక్షించారు.

అనంతలో చేతన్‌శర్మ పర్యటన



బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చేతన్‌శర్మ, అజయ్ మెహ్రా, అమిత్ సిద్ధేశ్వర్

అనంతపురం: భారత మాజీ క్రికెటర్, బీసీసీఐ కామెంటరేటర్ చేతన్ శర్మతో పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెటర్, కామెంటరేటర్ అజయ్ మెహ్రా, బీసీసీఐ క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్ ఆదివారం అనంతపురానికి చేరుకున్నారు. అనంత క్రీడా గ్రామంలో దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో వారి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ క్రమంలో ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం బత్తలపల్లిలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సమాధిని, పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధిని సందర్శించారు.

నిర్వహణలో 'డకౌట్'

- దులీప్ ట్రోఫీ నిర్వహణలో బయటపడిన లోపాలు
- రూ.4.5 కోట్లు అందినా వసతుల కల్పనలో విఫలం
- మంచి నీరు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన గాల్లోకి..
- తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ విక్రయ కాంట్రాక్టు ఏకపక్షంగా కేటాయింపు
- ఇష్టారాజ్యంగా పాసులు పంచిన ఒక అధికారి
- పాసులు పొందిన వారు రాక సగం స్టేడియం ఖాళీ
- క్రికెట్ ప్రేమికులకు తీరని వేదన
- ఆటగాళ్లకు భద్రతలోనూ వైఫల్యం
- ఏసీఏ, డీసీఏ సమన్వయలోపంతో దుస్థితి దాపురించిన వైనం

దేశవాళీ క్రికెట్ టోర్నమెంటుల్లో దులీప్ ట్రోఫీ అత్యంత ప్రతిష్టాత్మకమైంది. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన టోర్నీకి అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికగా మారింది. ఎక్కడా లోటుపాట్లు లేకుండా మ్యాచులను విజయవంతంగా ముగిస్తే.. జిల్లాకు పేరు ప్రఖ్యాతులు రావడంతో పాటు మరిన్ని మెగా టోర్నీలు ఇక్కడ జరిగే అవకాశముంటుంది. కానీ 'అనంత'లో మ్యాచుల నిర్వహణను చూస్తే అదంతా కలేననే భావన కలుగుతోంది. నిర్వాహకుల ఇష్టారాజ్యం, బెల్లంపప్పుల్లా తమ వారికి పాసుల పంపిణీ, వసతుల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం, బీసీసీఐ నిబంధనల ఉల్లంఘన, క్రీడాకారులకు తగిన భద్రత కల్పించడంలో వైఫల్యం వెరసి ఉన్న పరువూ పోయే దుస్థితి దాపురించింది.



ఇండియా సీ, ఇండియా డీ మ్యాచ్ జరిగినన్ని రోజులూ తగినంత మంది ప్రేక్షకులు లేని ఆర్డీటీ స్టేడియం




మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బందికి పాలిథిన్ కవర్లలో ఇచ్చిన నాసిరకం భోజనం

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 5న ఇండియా సీ, ఇండియా డీ జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్ శనివారం ముగిసింది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ క్రికెటర్లతో పాటు ఐపీఎల్‌లో మెరిసిన క్రీడాకారులు నగరానికి వచ్చారు. ఈ క్రమంలో వీరి ఆటను నేరుగా చూసి ఆస్వాదించాలనుకున్న అభిమానుల ఆశలు అడియాసలయ్యాయి. ఏకంగా 3 వేల ఉచిత పాసులను ఓ అధికారి తన కింది స్థాయి ఉద్యోగులకు పంచిపెట్టారు. అయితే, వారెవరూ ఇక్కడికి రాకపోగా.. స్టేడియం ఖాళీగా కనిపిస్తూ పరువు పోవడంతో పాటు టికెట్లు దక్కక సాధారణ క్రికెట్ అభిమానులకు నిరాశ మిగిలింది. తమ నగరానికే వచ్చిన అభిమాన క్రికెటర్ల ఆటను చూసి మురిసే భాగ్యం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డీసీఏ) సమన్వయలోపంతోనే ఈ దుస్థితి తలెత్తిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తీసికట్టుగా వసతులు..

దులీప్ ట్రోఫీ నిర్వహణకు రూ.4.5 కోట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్‌కు పంపింది. ఇంత పెద్ద మొత్తంలో నిధులు అందినప్పటికీ కనీస వసతుల కల్పనలో నిర్వాహకులు విఫలమయ్యారు. విధుల్లో ఉన్న పోలీసులు, స్థానిక మీడియా ప్రతినిధులకు పాలిథిన్ కవర్లలో ఆహారం అందించారు. ఒక్కో భోజనానికి రూ.30 కూడా ఖర్చు చేయని పరిస్థితి. నేషనల్ మీడియా ప్రతినిధులకు సకల సౌకర్యాలు కల్పించి స్థానిక మీడియాపై మాత్రం చులకన భావం ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది. బయట విధులకు కేటాయిస్తే ఇంట్లో ఆహారమైనా తిని డ్యూటీకి వెళ్లేవారమని, ఇక్కడ విధులకు కేటాయించడంతో నాసిరకమైన భోజనాన్ని తినాల్సి వచ్చిందని పోలీసులు, మీడియా ప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. అయితే, వీటికి సంబంధించి బిల్లుల్లో అధికంగా చూపి జేబులు నింపుకోనున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

స్నాక్స్, వాటర్ మాటున దోపిడీ..

బీసీసీఐ, ఏసీఏ ఆధ్వర్యంలో జరిగే ఏ టోర్నీలో అయినా స్నాక్స్, కూల్‌డ్రింక్స్ అమ్మకపు కాంట్రాక్టు అధికారికంగా అప్పగించాల్సి ఉంటుంది. కానీ దులీప్ ట్రోఫీ జరిగే ఆర్డీటీ క్రీడా గ్రామంలో స్నాక్స్, కూల్‌డ్రింక్స్ అమ్మకాలు ఒకే వ్యక్తి ఆధ్వర్యంలో జరిగాయి. ప్రేక్షకులకు ఉచితంగా మంచినీరు అందించాలని బీసీసీఐ నిర్దేశించినా.. మినరల్ వాటర్ పేరుతో ఒక గ్లాసు ఏకంగా రూ.10కు అమ్మకాలు సాగించారు. చిన్న పాప్‌కార్న్ పాకెట్ రూ.50కి విక్రయించారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మాజీ క్రికెటర్లకు గౌరవమేదీ..?

స్టేడియంలో వీఐపీలకు కేటాయించిన బ్లాక్-ఏ గ్యాలరీ టికెట్లు ఎవరి చేతిలోకి వెళ్లాయో అంతుపట్టని పరిస్థితి. పైగా ఈ గ్యాలరీలోకి మాజీ క్రికెటర్లను అనుమతించకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా, రంజీ స్థాయి మాజీ క్రికెటర్ల బాధ వర్ణనాతీతంగా మారింది. ఆర్గనైజింగ్ కమిటీలో మాజీ క్రికెటర్లకు అవకాశం కల్పించినా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిసింది.

అభిమానుల ఆవేదన..

ద్వితీయ శ్రేణి నగరాల్లో దేశవాళీ టోర్నీలు నిర్వహిస్తే అభిమానులు ఆనందిస్తారు. తమ అభిమాన క్రికెటర్ల ఆట తీరును చూసేందుకు స్టేడియాలకు పోటెత్తుతారు. కానీ, అనంతలో మాత్రం ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ నవ్వులపాలు చేస్తుండడంపై అభిమానులు ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 12 నుంచి జరిగే మ్యాచుల నుంచైనా లోటుపాట్లు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



స్టేడియంలో అనధికారికంగా విక్రయిస్తున్న తినుబండారాల ధరల వివరాలిలా..

సిబ్బంది.. ఇబ్బంది

దులీప్ ట్రోఫీ మ్యాచులకు బందోబస్తు నిమిత్తం ఏకంగా 420 మంది పోలీసులను కేటాయించారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. ఈ నేపథ్యంలో గొడవలు జరిగే ఆస్కారముంటుంది. తగినంత మంది పోలీసు సిబ్బంది ఉంటే అలాంటి వాటిని కట్టడి చేసే అవకాశముంటుంది. కానీ, అవేవీ పట్టకుండా పెద్ద సంఖ్యలో పోలీసులను ఆర్డీటీ క్రీడా గ్రామం వద్ద మోహరించడంపై ఆ శాఖ సిబ్బంది నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఇంత మంది పోలీసులను బందోబస్తుకు కేటాయించినా ఒక అభిమాని గ్రౌండ్‌లోకి దూసుకెళ్లడం గమనార్హం. ఇక.. పర్యవేక్షణ పేరిట తమనూ ఇక్కట్లకు గురిచేస్తున్నారంటూ రెవెన్యూ సిబ్బంది వాపోతున్నారు. దులీప్ ట్రోఫీ నిర్వహణలో కలెక్టర్, ఎస్పీ మితిమీరిన జోక్యం చేసుకుంటూ తమను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆయా శాఖల వర్గాలు వాపోతున్నాయి.